క్లుప్తంగా

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

ఇంద్రవెల్లి: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులు మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ముందుగా మేజర్ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి మాట్లాడారు. వందశాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. ప్రతీరోజు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని అన్నారు. ఎంపీవో సంతోష్, పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, సిబ్బంది జైస్వాల్ శంకర్‌లాల్ తదితరులు ఉన్నారు.

మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న యాదవులు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో బీసీ సీఎంను చేస్తామని ప్రకటించడం పట్ల యాదవులు హర్షం వ్యక్తంచేశారు. జిల్లాకేంద్రంలోని యాదవ సంఘ భవనం ఎదుట ప్రధాని మోదీ ఫ్లెక్సీకి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నారాయణ, వెంటక, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో బుధవారం నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మావల మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు ఈ సభకు తరలిరావాలని కోరారు. మావల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, మావల వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ ఆదివాసీ విభాగం జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనందరావ్, నాయకులు సురేష్, భూమేష్, ఎంబడి బాలకృష్ణ, కొత్తపెల్లి అడేల్లు, కుంభోజి రాములు, తదితరులు ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని గుండాల గోండుగూడ గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, ఏఎన్‌ఎం ఈశ్వరి, గ్రామ పటేల్ శ్రీరాం తదితరులు ఉన్నారు.

నేడు పత్తి కొనుగోళ్లు ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో బుధవారం ప్రైవేట్, సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఎంపీపీ రాథోడ్ సజన్ మంగళవారం ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలగానే రోప్‌వే

- అభివృద్ధికి నోచని కుంటాల జలపాతం
- అటవీ అనుమతులు లేక బ్రేక్
- గతంలో నిధులు మంజూరు..
- స్థలం కేటాయించని అటవీశాఖ..
- ఆహ్లాదానికి పర్యాటకులు దూరం..
- నీటిమాటగానే టూరిజం కారిడార్ హామీ

పచ్చటి అడవిలో సహజ సిద్ధంగా ఏర్పడి.. పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచే తెలంగాణ నయాగారగా పిలిచే కుంటాల జలపాతం అభివృద్ధికి నోచడం లేదు. జలపాతం అందాలు తిలకించేందుకు నిర్మించతలపెట్టిన రోప్‌వే అటవీశాఖ అనుమతులు రాక నిలిచిపోయింది. సర్కారు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం మొదలుకాలేదు. దీంతో పర్యాటకులకు ఆహ్లాదం అంతంతమాత్రంగానే అందనుంది.



కుంటాల జలపాతం(ఫైల్)

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం అభివృద్ధి కలగానే మిగిలిపోనుంది. ఈ జలపాతం అందాలను దగ్గరి నుంచి చూసేందుకు ప్రభుత్వం ఇక్కడ రోప్‌వే నిర్మాణం చేపట్టేందుకు... నిధులు మంజూరు చేసింది. అయితే అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రస్తుతం అది కలగానే మిగిలిపోనుందని పర్యాటకులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. జలపాతం వద్ద రోప్‌వే నిర్మాణానికి అవసరమైన స్థలం ఇవ్వడానికి అటవీశాఖ అనుమతి నిరాకరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే తప్పా స్థలం కేటాయించే పరిస్థితి లేదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో పర్యాటక అభివృద్ధి శాఖ ఈ ప్రాజెక్టును విరమించుకుంది.

వసతి సౌకర్యం లేక..

కుంటాల జలపాతం వద్ద వసతి సదుపాయం లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రకృతి ప్రేమికులు అసౌకర్యాలకు గురవుతున్నారు. అలాగే వారికి జాలువారే అందాలను దూరం నుంచే వీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ రోప్‌వే నిర్మాణం చేపడితే జలపాతం అందాలు దగ్గరి నుంచి వీక్షించే అవకాశం కలుగనుంది. ప్రత్యేక అనుభూతి కోసం పర్యాటకశాఖ ప్రణాళికలు రూపొందించి నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని అటవీశాఖకు లేఖ సైతం రాసింది. టెండర్లు పిలువాల్సిన సమయంలో అనుమతులు ఇవ్వకుండా అటవీశాఖ షాక్ ఇచ్చింది.

నెరవేరని హామీ..

రాష్ట్రంలోని కుంటాల, పొచ్చరతో పాటు బోథ్ నియోజకవర్గంలోని సప్త జలపాతాలను పర్యాటక వలయం (టూరిజం కారిడార్)గా చేస్తామన్న ప్రభుత్వ హామీ నీటిమూటగానే మిగిలింది. కుంటాల జలపాతం వద్ద పర్యాటకుల తాకిడితో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఇక్కడ సరైన సౌకర్యాలు కల్పిస్తే ప్రకృతి ప్రియులు ఆహ్లాదాన్ని ఆస్వాదించవచ్చు. ప్రత్యేక ప్యాకేజీని రూపొందించి త్వరలోనే అభివృద్ధి చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ అది కలగానే మారనుంది.

అటవీ అనుమతులు లేక...



కుంటాల జలపాతానికి ఇప్పటికే అభివృద్ధి కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. పర్యాటకులు దగ్గరి నుంచి జలపాతం అందాలను వీక్షించేందుకు రోప్‌వే నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ అటవీశాఖ స్థలం కేటాయించేందుకు నిరాకరించింది. దీంతో ఆ పనులు ముందుకు సాగలేని పరిస్థితి.

– రవికుమార్, టూరిజం జిల్లా అధికారి, ఆదిలాబాద్

వ్యవసాయం పండుగలా మార్చాం

- ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: తొమ్మిదన్నర ఏళ్లలో బీఆర్‌ఎస్ వ్యవసాయం పండుగలా మార్చిందని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. మండలంలోని సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమ ఫలాలను ఆపాలంటూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. మళ్లీ అదే రైతులను ఓట్లు అడగడానికి ఎలా వస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రక్కనే ఉన్న మహారాష్ట్రలో ఎందుకు అమలుకావడం లేదో ప్రజలు గమనించాలన్నారు. కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీల అమలులో ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, నాయకులు తాక్రే గంభీర్; జక్కుల మధుకర్, సతీష్‌పవార్, ప్రమోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాంఘర్‌పూర్‌లో భజన చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జోగు రామన్నను గెలిపించాలి

కైలాస్‌నగర్: పట్టణంలోనీ బంగారిగూడ వాసుల ఇళ్లపట్టా కలను సాకారం చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని బంగారుగూడ కాలనీలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తూ, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల కోసమే సీఎం కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. అభివృద్ధి పరమావధిగా దూసుకుపోతున్న కారు గుర్తు పార్టీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, నాయకులు అడప తిరుపతి, మల్లయ్య, సత్యనారాయణ, ఇస్రాల్, ఆరిఫ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

ఆర్థికసాయం

కడెం: మండలంలోని పాండ్వపూర్ పంచాయతీలోని తండాకు చెందిన అజ్మీరా నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. మంగళవారం బాధిత కుటుంబానికి జై జవాన్..జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. లింగన్న, రాజశేఖర్, నరేశ్ ఉన్నారు.

'కల్వకుంట్ల' కుటుంబపాలనకు చరమగీతం పాడాలి

- బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు

ఇచ్చోడ: తొమ్మిదేళ్లల్లో కల్వకుంట్ల కుటుంబం రూ.లక్షల కోట్లు దోచుకుందని, వారి పాలనకు చరమగీతం పాడాలని బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. మండలంలోని అడేగామ(కె)లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం తమ నిధులు ఇస్తోందని ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. ప్రజలు సుస్థిర పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరగా, సోయం బాపూరావు వారికి కాషాయ కండువా కప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఆడేమానాజీ, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భీంరెడ్డి, కదంబాబారావు, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, అధికార ప్రతినిధి సాకాటి దశరథ్, రైల్వేబోర్డు సభ్యుడు జీవీ రమణ, నాయకులు బత్తుల అశోక్, సోయం యువసేన జిల్లా అధ్యక్షుడు అక్కెపెల్లి లక్ష్మణ్, మండల కన్వీనర్ కేంద్రే నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోయం బాపూరావు

రహదారి కష్టాలు



పున్నగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇదే

- పున్నగూడలో రోడ్డు లేక ఇబ్బందులు
- వర్షాకాలంలో బురదమయం
- ఇక్కట్లు ఎదుర్కొంటున్న ఆదివాసీలు

నార్నూర్: గాదిగూడ మండలంలోని పున్నగూడ గ్రామం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి మౌలిక వసతులు కానరావడం లేదు. గ్రామంలో దాదాపు వంద ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. గాదిగూడ మండల కేంద్రం నుంచి పున్నాగూడకు దాదాపు 10 కి.మీ ఉంటుంది. సరైన లింక్ రోడ్డు లేదు. గ్రామానికి రోడ్డు లేకపోవడంతో తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించారు. రోడ్డు నిండరాళ్లు, గుంతలు తేలి దర్శనమిస్తోంది. ఆటోలు, 108, 104 వాహనాలు రాని పరిస్థితి. గ్రామంలోని రేషన్ దుకాణాలకు మహిళలు, పింఛన్ల కోసం వృద్ధులు కాలినడక వెళ్తూ నరకయాతన పడుతున్నారు. వర్షాకాలంలో బురదమయం కావడంతో ఆదివాసీలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్డుపై పారడంతో దుర్గంధం వస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో బీటీ రోడ్లతో పాటు డ్రెయినేజీలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇబ్బందవుతోంది



పున్నగూడకు రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుంది. చాలా ఇబ్బందవుతోంది. బీటీ రోడ్డు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బాదుబాయి, సర్పంచ్, డాబా(బి)

త్వరలో పనులు ప్రారంభిస్తాం



గాదిగూడ నుంచి పున్నగూడకి బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టి తీసుకెళ్లాం. ఐటీడీఏ నుంచి రూ.2.50 కోట్లు మంజూరైంది. అటవీశాఖ అనుమతి లేదని అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అడ చంద్రకళ రాజు, ఎంపీపీ గాదిగూడ

ఓటుహక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దస్తురాబాద్: అర్హులందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏపీడీ గోవింద్‌రావ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తూ పాఠశాలల విద్యార్థులు, డ్వాక్రా సంఘం మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం శోభారాణి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్, ఎన్నికల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం గంగన్న, ఐకేపీ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

బోథ్: ఎన్నికల నిబంధనలు పాటించాలని బోథ్ సీఐ భీమేష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రోడ్లపై, ఇతర ప్రదేశాల్లో గుమిగూడ వద్దని పేర్కొన్నారు. అభ్యర్థుల ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే ముందస్తు ప్రచారం తప్పనిసరి పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడితే ఎవరైనా సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

'అనారోగ్యరీత్యా బాధ్యతల నుంచి తప్పకుంటున్నా'

ఎదులాపురం: తన వ్యక్తిగత అనారోగ్య కారణాల వల్లే రజక సంఘ జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు చిక్కాల దత్తు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత జిల్లా, మండల కార్యవర్గాలు రద్దు చేశామని, నూతనంగా 10 మంది సభ్యులతో అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నామన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఏడీఏ సుజాత, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ సయ్యద్ అజంఅలీ, ఖానాపూర్ సీఈవో ఆశన్న, సత్తన్‌పల్లి సీఈవో శ్రీనివాస్ ఉన్నారు.

ఆడె గజేందర్‌కు ఘన స్వాగతం

- రోల్‌మామడ టోల్‌ప్లాజా నుంచి బోథ్ వరకు బైక్ ర్యాలీ
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

నేరడిగొండ: కాంగ్రెస్ అధిష్టానం బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆడె గజేందర్‌ను ప్రకటించింది. హైదరాబాద్ నుంచి నేరడిగొండకు ఆయన రావడంతో మంగళవారం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పెద్దఎత్తున రోల్‌మామడ టోల్‌ప్లాజా నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో అంబేద్కర్, కుమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం బోథ్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అందరికి అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆడె గజేందర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బోథ్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, మహెమూద్ ఖాన్, నాయకులు ఆడె వసంత్ రావు, రాజశేఖర్‌రెడ్డి, పసుల చంటి, షేక్ బాబా, నర్సింగ్, పాల శంకర్, నాయిడి రవిందర్, బి.రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గజేందర్

'కాంగ్రెస్ హయాంలో దుర్భర పరిస్థితులు'

ఎదులాపురం: కాంగ్రెస్ హయాంలో ప్రజలు ఎన్నో దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. పట్టణంలోని ఖుర్షీద్‌నగర్, తాటిగూడ, రాంనగర్ కాలనీలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 65 ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు మరోసారి అవకాశం ఇవ్వాలనడం సిగ్గుచేటన్నారు. రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేశ్, నాయకులు బుట్టి శివకుమార్, గంగారెడ్డి, భూమన్న, అష్రఫ్, సలీం, మోసిన్, దయాకర్, అశోక్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

'ప్రజా ఆశీర్వాద సభ' విజయవంతం చేయండి

నార్నూర్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బానోత్ గజానంద్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభకు కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. మాజీ జడ్పీటీసీ రూపావతి జ్ఞానోబా పుస్కర్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, పార్టీ జనరల్ కార్యదర్శి సయ్యద్ ఖాశీం, గిరిజనేతరుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ దాదేఅలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బానోత్ గజానంద్‌నాయక్

అభివృద్ధిని చూసి ఓటేయండి

ఇంద్రవెల్లి: గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని పార్టీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను మద్దతుగా కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, ఎంపీటీసీ మడావి భీంరావ్, నాయకులు శ్రీనివాస్, ముండే బాబు, బాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.



పొలంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

చికెన్ కొడుతూ ప్రచారం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదావత్ పూర్ణచందర్ నాయక్ పాల్గొన్నారు. చికెన్ సెంటర్‌లో చికెన్ విక్రయిస్తూ ఆకట్టుకున్నారు. ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను ప్రజలు గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఉన్నారు.



చికెన్ కట్‌చేస్తున్న పూర్ణచందర్

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, బీర్నంది, కోలాంగూడ, పాతఎల్లాపూర్, గోసంపల్లె, దిలావార్‌పూర్, బావాపూర్(కే), కొత్తపేట్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. సెక్టోరల్ అధికారి రత్నాకర్‌రావు, రూట్ అధికారి రాకేశ్ విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఎర్వచింతల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు